### ఎలక్ట్రానిక్ సిటీలో పెట్టుబడులు

తైవాన్‌కు చెందిన సెరా నెట్‌వర్క్స్, హైదరాబాద్‌కు చెందిన రెసొల్యూట్ అప్లయన్సెస్‌తో కలిసి రూ. 300 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లోని ఎలక్ట్రానిక్స్ సిటీలో ఉత్పత్తి యూనిట్ రానుంది. ప్రభుత్వం కేటాయించిన 10 ఎకరాల్లో అత్యాధునిక డేటా సెంటర్ స్విచ్‌లు, 5జీ టెక్నాలజీకి సంబంధించిన పరికరాలతో పాటు ఇతర ఎలక్ట్రానిక్స్ విడి భాగాలను ఉత్పత్తి చేస్తాయి.

## ఆర్థికం

### ప్రాధాన్య రంగాలకు రుణాలు

● ప్రాధాన్య రంగాలకు ఇచ్చే రుణాల పద్ధతి (ప్రయార్టీ సెక్టార్ లెండింగ్)లో మార్పులు చేస్తూ ఆర్‌బీఐ ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ 1 నుంచి ఇవి అమల్లోకి వచ్చాయి. ఇక నుంచి విద్యా రంగానికి రూ. 25 లక్షలు, సామాజిక అవస్థాపన సౌకర్యాలకు రూ. 8 కోట్లు ఇవ్వనున్నారు. పునరుత్పాదక శక్తిపై దృష్టి సారించే ప్రాజెక్ట్‌లకు రూ. 35 కోట్లు ఇవ్వనున్నారు. అలాగే బలహీన వర్గాల విభాగంలో ట్రాన్స్‌జెండర్లను కూడా చేర్చారు.

### అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు

● రూ. 45,000 కోట్లకు పైగా అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్‌కు బదిలీ చేసినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ లోక్‌సభలో తెలిపింది. బ్యాంక్ ఖాతాల్లో నగదు 10 సంవత్సరాలు ఉంచి, ఎలాంటి లావాదేవీలు నిర్వహించని పక్షంలో వాటిని అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లుగా ప్రకటిస్తారు.

### పాల ఉత్పత్తిలో అగ్రస్థానం



● పాల ఉత్పత్తిలో భారత్ అగ్రస్థానంలో ఉందని కేంద్రం ప్రకటించింది. దేశంలో 239 మిలియన్ మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి అవుతుందని పేర్కొంది.

### పీఎం వికాస్ పథకం

● ప్రధాన మంత్రి విరాసత్ కా సంవర్ధన్ (పీఎం వికాస్) పథకాన్ని మైనారిటీ వ్యవహారాల కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. మైనారిటీలకు నైపుణ్య పెంపు, విద్య, ఆర్థిక సాధికారతను సాధించేందుకు ఉద్దేశించింది ఇది. గతంలో అమలైన 'సీకో ఔర్ కమావో', 'నయా మంజిల్', 'నయా రోష్నీ', 'ఉస్తాద్', 'హమారీ ధరోహర్' పథకాలను పీఎం వికాస్‌లో విలీనం చేశారు.

## అంతర్జాతీయం

### యూఎన్ఈపీ

● 2022లో 1.05 బిలియన్ టన్నుల ఆహార వృథా జరిగిందని ఐక్యరాజ్య సమితి పర్యావరణ కార్యక్రమం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. గృహాల్లోనే 61% వృథా ఉంటుందని వెల్లడించింది. ఆహార వృథాలో చైనా అగ్రస్థానంలో ఉండగా భారత్ రెండో స్థానంలో ఉందని నివేదిక పేర్కొంది.



### అమెరికా

● అమెరికా ఎన్నికలకు సంబంధించి డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఓటరుగా నమోదు కావాలంటే అమెరికా పౌరుడిగా నిరూపించే ఆధారాలను చూపించాలి. ఎన్నికల్లో అక్రమాలు జరగకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. అమెరికాలో ఫెడరల్ విద్యా వ్యవస్థను మూసివేశారు. ఇక నుంచి ఈ బాధ్యతను రాష్ట్రాలే స్వీకరించనున్నాయి.

### మూడు నగరాలకు అవార్డులు

● అంటుకోవడం ద్వారా వ్యాపించని వ్యాధుల కట్టడిలో పురోగతి చూపినందుకు కొర్డోబా (అర్జెంటీనా), ఫోర్టలెజా (బ్రెజిల్), మాంచెస్టర్ (యూకే) నగరాలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపును ఇచ్చింది. పార్ట్‌నర్‌షిప్ ఫర్ హెల్త్ సిటీస్ అనే ఒక ప్రపంచ నెట్‌వర్క్ నగరాలను ఎంపిక చేస్తుంది. ఈ నెట్‌వర్క్ 2017లో ఏర్పాటయ్యింది. 74 నగరాలు ఇందులో ఉన్నాయి.




### ఎన్‌డీబీలో ఇండోనేషియా

● చైనాలోని షాంఘై కేంద్రంగా పనిచేసే న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకులో ఇండోనేషియా చేరనుంది. బ్రిక్స్ దేశాలతో పాటు ఇప్పటికే ఇందులో అల్జీరియా, ఈజిప్ట్, యూఏఈ, ఉరుగ్వే ఉన్నాయి.

## శాస్త్ర-సాంకేతికం

### ఎంఆర్ఐ మెషిన్

● దేశంలో తొలిసారి స్వదేశీ పరిజ్ఞానంతో 'మాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్ మెషిన్'ను రూపొందించారు. న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌లో మొదట ప్రయోగాత్మకంగా ఈ యంత్రాన్ని అందుబాటులోకి తేనున్నారు.

### ఐస్ షెల్ఫ్ దిగువన జీవం

● అంటార్కిటికా ఖండంలోని ఐస్ షెల్ఫ్‌లో జల జీవజాలం ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. జార్జ్-6 ఐస్ షెల్ఫ్ నుంచి ఏ-84 అనే ఐస్‌బర్గ్ విడిపోవడంతో దిగువన పరిశీలించేందుకు అవకాశం దొరికింది. ఐస్‌ఫిష్‌తో పాటు పెద్ద స్పైడర్లు, గతంలో చూడని వివిధ జలచర జీవులను పరిశోధనలో భాగంగా గుర్తించారు.



## జాతీయం

### భారత్-యునిసెఫ్

● భారత గ్రామీణ మహిళలు, యువత సాధికారత సాధించడంతో పాటు వారికి జీవనోపాధి కల్పించేందుకు భారత గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ, యునిసెఫ్ భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. మూడు సంవత్సరాలు ఇది అమల్లో ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ మౌలిక సదుపాయాలను వృద్ధి చేయడం, మహిళలను వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం.

### ఛత్తీస్‌గఢ్

● రాష్ట్ర శాసన వ్యవస్థ సిల్వర్ జూబ్లీ వేడుకలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. వామపక్ష తీవ్రవాదం వైపు యువత వెళ్లకుండా సామాజిక-ఆర్థిక అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి విడదీసి 2000లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు.




### కమిషన్ గడువు పొడిగింపు

● ఒకే దేశం ఒకే ఎన్నికకు సంబంధించి నియమించిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ గడువును వానాకాలపు సమావేశాల వరకు పొడిగించారు. దీనికి పార్లమెంట్ సభ్యుడు పీపీ చౌదరి నాయకత్వం వహిస్తున్నారు. 39 మంది ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఇటీవల విజయ సాయి రెడ్డి రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది.

### విపత్తు నిర్వహణ బిల్లుకు ఆమోదం

● విపత్తు నిర్వహణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. గత చట్టానికి కొన్ని సవరణలు చేశారు. గతంలో విపత్తు నిర్వహణ ప్రణాళికలను కార్యనిర్వాహక కమిటీలు చేస్తుండగా తాజాగా ఆ అధికారాన్ని కేంద్ర, రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థలే నిర్వహిస్తాయి. అలాగే పట్టణ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థలను ఏర్పాటు చేయనున్నారు. ఇవి రాష్ట్ర రాజధానుల్లో ఉంటాయి. సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చైర్మన్‌గా ఉంటారు. ఆ జిల్లా కలెక్టర్ వైస్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు.

### ఉత్తరప్రదేశ్



● లక్నోలో కుక్రైల్ నైట్ సఫారీని ఏర్పాటు చేయాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ తరహా నైట్ సఫారీ దేశంలో ఇదే మొదటిది.

### టీబీ రహిత కార్యక్రమం

● టీబీని నిర్మూలించేందుకు ఉద్దేశించిన కార్యక్రమాలను దేశమంతటికీ విస్తరించనున్నారు. కేవలం 455 జిల్లాల్లో అమలవుతున్న ఈ కార్యక్రమం ఇక నుంచి అన్ని జిల్లాల్లోనూ అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది.

## క్రీడలు

### కబడ్డీ పోటీ

● ప్రపంచ కప్ కబడ్డీ పోటీలను యూకేలో నిర్వహించారు. భారత పురుషులు, మహిళల జట్లు విజయం సాధించి కప్‌ను అందుకున్నాయి. రెండు విభాగాల్లోనూ తుది పోరులో భారత్ ఇంగ్లండ్ జట్టును ఓడించింది. మార్చి 17 నుంచి 23 వరకు ఈ పోటీలను నిర్వహించారు. 2019లో నిర్వహించిన తొలి కబడ్డీ చాంపియన్‌షిప్‌లోనూ భారత పురుష, మహిళల జట్లే విజయం సాధించాయి.



### సుమిత్ రెడ్డి

● భారత సీనియర్ షట్లర్ సుమిత్ రెడ్డి బ్యాడ్మింటన్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. 2022 కామన్వెల్త్ గేమ్స్ మిక్స్‌డ్ టీంలో రజతం గెలుచుకున్నాడు.

### సెపక్‌తక్రా

● పాట్నాలో జరిగిన సెపక్‌తక్రా ప్రపంచ కప్‌లో భారత పురుషుల జట్టు స్వర్ణం గెలుచుకుంది. భారత జట్టు జపాన్‌పై విజయం సాధించింది. దీంతో సెపక్‌తక్రా ప్రపంచ కప్‌లో తొలిసారి భారత్ స్వర్ణం గెలుచుకుంది.

● ఈ టోర్నీ డబుల్స్‌లో భారత మహిళల జట్టు రజతం గెలుచుకుంది. భారత్ మలేషియా జట్టు చేతిలో ఓడింది. 20 దేశాలు పోటీపడుతున్న ఈ టోర్నీలో మహిళల డబుల్స్ ఈవెంట్‌ను ప్రవేశపెట్టడం తొలిసారి. భారత మహిళల జట్టు కాంస్య సాధించింది.



## వార్తల్లో వ్యక్తులు

### రాహుల్ బావే

● ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈవోగా రాహుల్ బావే నియమితులయ్యారు.

### వినోద్ కుమార్ శుక్లా



● ప్రముఖ హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లాకు 59వ జ్ఞానపీఠ అవార్డ్‌ను ప్రకటించారు. దేశంలో ఇది అత్యున్నత సాహిత్య పురస్కారం. ఈ అవార్డ్ పొందిన ఛత్తీస్‌గఢ్ వాసి అతను. హిందీలో ఈ పురస్కారాన్ని పొందిన 12వ వ్యక్తి.

### అశోక్ సింగ్ ఠాకూర్

● ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్‌కు చైర్మన్‌గా అశోక్ సింగ్ ఠాకూర్ ఎన్నికయ్యారు. ఆయన మూడు సంవత్సరాలు ఈ పదవిలో కొనసాగుతారు.

## తెలంగాణ

### కొత్తగూడెంలో యూనివర్సిటీ

● కొత్తగూడెం ప్రాంతంలో న్యూ యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ అండ్ సైన్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. కొత్తగూడెం మైనింగ్ కాలేజీని అప్‌గ్రేడ్ చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. అలాగే ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా ఆధునికీకరించనున్నారు.

### సిస్కో-టాస్క్ ఒప్పందం

● రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా సిస్కో నెట్‌వర్కింగ్ అకాడమీ, టాస్క్ పరస్పర అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. రాష్ట్రంలో నెలకొల్పిన స్కిల్స్ యూనివర్సిటీతో యువతకు సిస్కో నెట్‌వర్కింగ్ అకాడమీ శిక్షణ అందించనుంది.



### రాజీవ్ యువ వికాసం విధి-విధానాలు

● రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ జనాభా ప్రాతిపదికన యూనిట్లను ఖరారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలకు కేటాయించిన లక్ష్యాలను కలెక్టర్లు, సంబంధిత మండలాలు, మున్సిపాలిటీల్లోని సంక్షేమ వర్గాల జనాభా మేరకు యూనిట్లు మంజూరు చేస్తారు. రూ. 50 వేల విలువైన యూనిట్‌కు వంద శాతం రాయితీ ఇవ్వనున్నారు. జిల్లా మంత్రి అనుమతితో కలెక్టర్ అర్హులను ఎంపిక చేస్తారు. రానున్న ఐదేళ్ల వ్యవధిలో కుటుంబం నుంచి ఒక్కరికే స్వయం ఉపాధి పథకం మంజూరు చేస్తారు. మొత్తం యూనిట్లలో 25% మహిళలకు కేటాయిస్తారు. ఒంటరి, వితంతు మహిళలకు ప్రాధాన్యం ఉంటుంది. దివ్యాంగులకు 5% రిజర్వేషన్లు ఇస్తారు. అలాగే తెలంగాణ ఎస్సీ వర్గీకరణ పోరాటంలో పాల్గొన్న కుటుంబాల వారికి, స్వయం ఉపాధిలో నైపుణ్యాలున్న వారికి ప్రాధాన్యం ఉంటుంది. వ్యవసాయేతర పథకాలకు జూలై 1 నాటికి 21-55 ఏళ్ల మధ్య, వ్యవసాయ ఆధారిత పథకాలకు 21-60 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

### ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి



● ఫిలిప్పీన్స్‌కు ఎనిమిది లక్షల టన్నుల తెలంగాణ బియ్యం ఎగుమతి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో తొలి విడతగా దాదాపు 12,500 టన్నులు కాకినాడ పోర్టుకు చేరింది. 'ఎంటీయూ 1010' రకం ముడి బియ్యాన్ని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఎగుమతి చేస్తుంది.

### గర్ల్‌ప్రైడ్

● గర్ల్‌ప్రైడ్ పేరుతో వినూత్న కార్యక్రమానికి ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శ్రీకారం చుట్టారు. జిల్లాలో ఆడపిల్ల పుట్టిన ఇంటికి జిల్లా అధికారులు వెళ్లి మిఠాయి బాక్స్ ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతారు. అమ్మాయి పుట్టడం శుభ సూచకం అని ప్రచారం కల్పించేందుకు దీన్ని చేపట్టారు.


వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411
